ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 112 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శనివారం 1 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# టామ్‌కాంకు కొత్త బాధ్యతలు

## ఉపాధి, ఉద్యోగాల కల్పనపై సీఎం దృష్టి

**టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగింత**

**డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ**

**అధికారులతో సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**



**హైదరాబాద్, జులై 31 (ప్రభాత ఉదయం)**

టామ్‌కాంకు కొత్త బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. పాస్‌పోర్టు నుంచి ఉద్యోగం వరకు సేవలు అందజేయాలని సూచించారు. విదేశీ ఉద్యోగాల కోసం టామ్‌కాం, మ్యాన్‌పవర్ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. యువత ఉపాధి, నైపుణ్యాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో యువత ఉపాధి, నైపుణ్యాలపై శక్తి శాఖ అధికారులతో సీఎం సమీ క్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. విదేశాలకు వెళ్లే కార్మికుల పూర్తి వివరాలను నమోదు చేయాలని సీఎం మార్గనిర్దేశం చేశారు. టామ్‌కాంకు మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారిని సీఈవోగా నియమిస్తామని అన్నారు. డ్రైవింగ్, విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జర్మన్, జపనీస్, కొరియన్ సహా విదేశీ భాషలకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. బ్లూ కాలర్ ఉద్యోగ శిక్షణార్థులకు స్కాలర్‌షిప్‌లపై అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఏటీసీల్లో ఈవీ సర్వీసింగ్, డ్రోన్ టెక్నాలజీ కోర్సులు ప్రవేశపెడతామని చెపకొచ్చారు. నర్సుల గ్లోబల్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖ మంత్రి వివేక వెంకటస్వామితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు

**పిఎం కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు**

**4.5 లక్షల కోట్ల పథకాలకు...కేంద్ర మంత్రివర్గం ఆమోదం**

**న్యూఢిల్లీ, జులై 31 (ప్రభాత ఉదయం)**

కేంద్ర కేబినెట్ నేడు రూ.4.5 లక్షల కోట్ల విలువైన పథకాలు, ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈ వివరాలను మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. మొత్తం 4,50,988 కోట్ల రూపాయల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు. ఇప్పటికే తలసరి సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో భారత్ మొదటి స్థానంలో ఉందని మంత్రి అన్నారు. ఈ పథకం కింద డ్యామ్‌లు, సరస్సులపై ఫ్లోటింగ్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి 5000 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశిరచుకున్నామని అన్నారు. రాబోయే ఐదేళ్లల్లో ఎ-లోటింగ్ సోలార్ ప్యానెల్ విద్యుత్ ఉత్పత్తిని 7 రెట్లు పెంచుతామని చెప్పారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి 3,15,614 కోట్ల రూపాయలు కేటాయించి నట్టు మంత్రి తెలిపారు. 2026-2030 మధ్య కాలానికి ఈ మొత్తాన్ని కేటాయించినట్టు తెలిపారు. ఇక సముద్ర మంథన్ పథకానికి 84,084 కోట్ల రూపాయలను కేంద్రం కేటాయించింది. 2030-31 వరకూ ఈ మొత్తాన్ని ..మిగతా 2లో



**బిఆర్‌ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే**

## పెద్ది కన్నుమూత

**వరంగల్‌లోని స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు**

**హాజరైన కేటీఆర్, హరీష్ రావు బిఆర్‌ఎస్ నేతలు**

**వరంగల్ జులై 31 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ఉద్యమ కెరటం, కేసీఆర్ ప్రధాన అనుచరుడు, నర్సంపేట రైతుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రైతు బాంధవుడు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధనలో తనదైన ముద్ర వేసి అందరి మన్ననలు పొందిన ఉద్యమ నేత, నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ..మిగతా 2లో

# జూరాలకు పర్యాటకుల శోభ





**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(ప్రభాత ఉదయం)**

జూరాల ప్రాజెక్టుకు పర్యాటకుల శోభ సంతరించుకుంది. ప్రాజెక్టుకు ఎక్కడ చూసినా పర్యాటకులే కనిపించారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వస్తుండటంతో జలకళను సంతరించుకుంది. జూరాల గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేయడంతో కృష్ణమ్మ అందలాను తిలికించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టుకు వచ్చి సందడి చేస్తున్నారు.కొందరు జూరాల అందాలను తమ సెల్ ఫోన్ లో బందించారు. కొందరు నీటి అంచునకు వెళ్లి సెల్ఫీల మోజులో పడారు. జూరాల ప్రాజెక్టు పరిసరాలలో సందర్శకుల తాకిడి పెరిగి వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పర్యాటకులు డ్యాం పై నే తమ వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అమరచింత, ధరూర్ పోలీసులు జూరాల పై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.



## పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(ప్రభాత ఉదయం)**

కర్ణాటక జలాశయాల నుంచి దిగువకు వరద నీటిని విడుదల చేయడంతో జూరాల ప్రాజెక్టుకు వరదప్రవాహం క్రమంగా పెరుగుతోంది జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద ప్రవాహంతో జూరాల వద్ద కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది. శుక్రవారం సాయంత్రానిలి జూరాల ప్రాజెక్టుకు 1.22లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. వరద నీటిని నియంత్రించేందుకు ప్రాజెక్టు అధికారులు డ్యాం 24 గేట్లు ఎత్తి దిగువకు 95,592 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో కృష్ణమ్మ శ్రీశైలానికి పరవళ్లు తొక్కుతూ పరుగులుతీస్తోంది. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 317.69 మీటర్లుగా ఉంది. అలాగే ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగ 8.011 టీఎంసీల నీరు నిల్వ ఉంది.జల విద్యుత్ ఉత్పత్తితో 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు మీద ఆదారపడిన నెట్టెంపాడు, కోయిల్ సాగర్, భీమ ఎత్తిపోతలకు, కుడి, ఎడమ కాలువలకు సాగునీటిని విడుదల చేశారు.

**తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ..**

## మరోసారి గడువు పొడిగింపు

**ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలనకు అవకాశం**

**హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నెమ్మదిగా సాగుతున్న సర్వే**

**రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77 శాతం ప్రక్రియ పూర్తి**




**హైదరాబాద్, జులై 31 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి పరిశీలన గడువును భారత ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. వాస్తవానికి ఆగస్టు 3తో ముగియాల్సిన ఈ గడువును ఆగస్టు 10 వరకు పొడిగిస్తూ శుక్రవారం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 77.12 శాతం సర్వే పూర్తయినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. అయితే, హైదరాబాద్ (56.31 శాతం), రంగారెడ్డి (63.43 శాతం), మేడ్చల్-మల్కాజ్‌గిరి (61.37 శాతం) వంటి కీలక జిల్లాల్లో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో గడువును పెంచాల్సి వచ్చింది. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి, ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్లను నిర్ధారించడం, నకిలీ ఓట్లను గుర్తించడం, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి పనులను చేపడుతున్నారు. ఓటర్ల జాబితా సవరణకు తొలుత జూలై 24ను తేది గడువుగా నిర్ణయించగా, దానిని ఆగస్టు 3కు పొడిగించారు. తాజాగా మరో వారం గడువు పెంచుతూ ఆగస్టు 10 వరకు అవకాశం కల్పించారు.



## భారత్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

**సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న సమావేశం**

**న్యూఢిల్లీ, జులై 31 (ప్రభాత ఉదయం)**

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నారు. 2020లో గల్వాన్ లోయలో భారత్-చైనా సైనికుల మధ్య జరిగిన ఘర్షణ తర్వాత తొలిసారి జిన్‌పింగ్ భారత్ పర్యటనకు రాబోతున్నారు. సెప్టెంబర్‌లో భారత్‌లో జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి రావాల్సిందిగా జిన్‌పింగ్‌కు భారత్ ఆహ్వానం పంపింది. అయితే భారత్ పర్యటనకు జిన్‌పింగ్ సిద్ధంగా ఉన్నట్లుగా వార్తలు వెలువడుతున్నాయి. గల్వాన్ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు కనిష్ట స్థాయికి చేరుకున్న నేపథ్యంలో జిన్‌పింగ్ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. బ్రిక్స కూటమికి ఈ ఏడాది భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తోంది. బ్రిక్స అధ్యక్ష బాధ్యతలకు ..మిగతా 2లో

# విద్యార్థుల ముసుగులో అసాంఘికశక్తుల దాడి



### మీ నిరసనలు సరే..మా సంగతేంటి?

### దాడిలో గాయపడ్డ పోలీస్ కుటుంబాల ఆందోళన

### తమకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్

**న్యూఢిల్లీ,జులై31 (ప్రభాత ఉదయం)**

జంతర్‌మంతర్ వద్ద ఇటీవల జరిగిన నిరసనల సందర్భంగా గాయపడిన ఢిల్లీ పోలీసు సిబ్బంది కుటుంబాలు న్యాయం కోసం డిమాండ్ చేశాయి. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై ఆందోళనకారులు.. రాళ్లురువ్వడం సహా చెప్పులతో దాడి చేశారని ఆరోపిస్తూ శుక్రవారం మీడియా ఎదుట బాధిత కుటుంబ సభ్యులు వాపోయారు. దేశ రాజధాని దిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనల సమయంలో ఎంతో మంది పోలీసులు గాయపడినా.. వారి గురించి ప్రజలకు పట్టట్లేదని ఆయా కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నిరసనల్లో గాయపడిన కొంతమంది పోలీసుల కుటుంబసభ్యులు శుక్రవారం మీడియా ముందుకొచ్చారు. నాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ తమకు కూడా న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గాయపడిన ఓ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ) కుమారుడు మాట్లాడుతూ తన తండ్రి ఎదుర్కొన్న పరిస్థితిని వివరిస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. 'మా నాన్న యూనిఫాం రక్తంతో తడిసిపోయింది' అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళనల సమయంలో ఆయన తలకు తీవ్ర గాయమైందని, నాలుగు కుట్లు కూడా పడినట్లు చెప్పుకొచ్చారు. తన తండ్రిని ఆ పరిస్థితుల్లో చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యానని వాపోయారు. నిరసనల సమయంలో గుంపులో కొందరు అసాంఘిక శక్తులు కలిసిపోయి మూకుమ్మడిగా రాళ్ల దాడికి దిగారని తన తండ్రి చెప్పినట్లు కుమారుడు వివరించారు. పోలీసులు స్పందించే అవకాశం లేకుండా వరుస దాడులు జరిగాయని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది.. నిరసనకారుల దాడులకు గురయ్యారని, గాయపడిన వారికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. ప్రజల రక్షణ కోసం పనిచేసే పోలీసులపై దాడులను సహించరాదని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నేను దిల్లీ యూనివర్సిటీలో చదువుతున్నా. మా నాన్న 15 ఏళ్ల పాటు నేవీలో మెరైన్ కమాండోగా సేవలందించారు. ఇప్పుడు దిల్లీ పోలీసు విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. విద్యార్థుల ఆందోళనల సమయంలో నాన్న ప్రధాన వేదిక అయిన జంతర్ మంతర్ వద్ద విధులు నిర్వహించారు. ప్రతి రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత.. నిరసనల గురించి మాకు చెప్పేవారు. విద్యార్థుల ముసుగులో కొంతమంది సంఘ విద్రోహ శక్తులు ఆందోళనల్లో చేరారని అన్నారు. ఆందోళనల సమయంలో మా నాన్నను కొంతమంది లాగి.. మూక దాడికి యత్నించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. దాదాపు నాలుగు గంటల పాటు నాన్న స్పృహలో లేరు. ఇంటికి తీసుకొచ్చేటప్పుడు ఆయన యూనిఫామ్ అంతా రక్తంతో తడిసిపోయింది. అలాంటి రోజు మా జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఈ ఘటన తర్వాత నేను సోషల్ మీడియా తెరవగా.. మా నాన్ననే నేరస్థుడిగా నిందిస్తున్నారు. ఆయనపై దాడి చేసిన వారే.. న్యాయం కావాలంటూ సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. అప్పుడే నిర్ణయించుకున్నా.. మాకూ న్యాయం జరగాల్సిందే. అందుకే గాయపడిన పోలీసుల కుటుంబాలతో కలిసి సుప్రీంలో పిటిషన్ వేశాం అని ఓ ఎస్సై కుమార్తె మీడియా ముందు తన ఆవేదనను పంచుకున్నారు. నా భర్త దిల్లీ పోలీసు విభాగంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్. 33 ఏళ్లుగా పోలీసు శాఖలో ఉన్నారు. ఆందోళనల సమయంలో ఆయనపై కొంతమంది దాడికి పాల్పడ్డారు. రాళ్లు, చెప్పులు.. ఏది దొరికితే దాంతో కొట్టారని ఆయన చెప్పారు. రాళ్ల దాడికి ఆయన పెట్టుకున్న హెల్మెట్ విరిగిపోయింది. ఈ నిరసనల తర్వాత ఎక్కడ చూసినా.. ఆందోళనకారులను పోలీసులు కొట్టారనే వార్తలే కన్పిస్తున్నాయి. కానీ, నాణెళినికి మరోవైపు కూడా ఉంది. దాన్ని ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రజల కోసం సేవలందిస్తున్న వారి ఆవేదనను దేశమంతా వినాలని ఓ అసిస్టెంట్ ఎస్సై భార్య సీమా భావోద్వేగానికి గురయ్యారు. మా తాత బీఎస్ఎఫ్‌లో పని చేశారు. 1971 యుద్ధంలో పాల్గొన్నారు. ఆయన స్ఫూర్తితోనే నాన్న పోలీసు శాఖలో చేరి అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆందోళనల సమయంలో బారికేడ్ల వద్ద విధులు నిర్వహిం చారు. ఉన్నట్టుండి తమపై ఆందోళనకారులు రాళ్లు విసిరారని నాన్న చెప్పారు. సీనియర్ అధికారులను రక్షించే క్రమంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. నాలుగు కుట్లు పడ్డాయ్. నేనూ విద్యార్థినే. విద్యార్థుల పట్ల నాన్న ఎప్పుడూ దురుసుగా ప్రవర్తించరు. ఈ నిరసనల్లో రౌడీలు, సంఘ విద్రోహ శక్తులు ఉన్నారని మరో పోలీసు కుమారుడు మీడియాకు తెలిపారు.



### బిఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే

# పెద్ది కన్నుమూత

**మొదటి పేజీ తరువాయి...**

ఇకలేరు. ఈ వార్తను నర్సంపేట ప్రజలే కాదు, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ నెల 26న తీవ్రమైన గుండెపోటు రావడంతో వెంటనే హనుమకొండలోని రోహిణి ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్, మరో మాజీ మంత్రి హరీశ్ రావు దగ్గరుండి హైదరాబాద్‌కు తరలించారు. గత ఐదు రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. తమ అభిమాన నాయకుడు, ఉద్యమ సారథి పెద్ది సుదర్శన్ రెడ్డి ఇకలేరనే విషయాన్ని నర్సంపేటతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నమ్మలేకపోతున్నారు. పెద్ది అకాల మరణం వరంగల్ జిల్లాలో విషాదాన్ని నింపింది. ఆయన మృతికి ఉమ్మడి వరంగల్‌తో పాటు యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా తమ నివాళులు అర్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన పెద్ది సుదర్శన్ రెడ్డి, కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ నేత కేసీఆర్ వెంటే నడిచారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన నాయకుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ది సుదర్శన్ రెడ్డి మొదటి వరుసలో నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ సాధన కోసం ప్రపంచ స్థాయిలో రికార్డు సృష్టించిన భారీ బహిరంగ సభను వరంగల్‌లోని ప్రకాశ్‌రెడ్డిపేటలో పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన ప్రధాన సభల బాధ్యతలను ఉద్యమ నేత కేసీఆర్ పెద్ది సుదర్శన్ రెడ్డికే అప్పగించేవారు. ఏల్కతుర్తిలో జరిగిన టీఆర్ఎస్ భారీ సభ కూడా ఆయన నిర్వహణలోనే జరిగింది. అధికారంలో ఉన్నామా లేదా అనేది కాదు ప్రజలకు ఏమి చేశామనేదే ముఖ్యం అనే భావనతో పనిచేసిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి. 2014లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడి పోయినప్పటికీ, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు సహకారంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట నియోజకవర్గానికి దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తీసుకొచ్చి, పాకాల సరస్సును నింపి నర్సంపేట ప్రజల గుండెల్లో రైతు బాంధవుడిగా చిరస్మరణీయమైన ముద్ర వేశారు. మాదన్నపేట వాగుపై సిద్దాం నిర్మించి, నర్సంపేట నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా కృషి చేశారు. రైతు బాంధవుడిగా సుదర్శన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మనసులో చెరగని ముద్ర వేశారు.


# ఇందిరమ్మ టవర్స్‌కు టెండర్ ప్రారంభం

### ఆగస్ట్ చివరలో నిర్మాణాలకు శ్రీకారం

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరాబాద్, జులై 31 (ప్రభాత ఉదయం)**

ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలకు ఆగస్టు చివరి వారంలో శ్రీకారం చుడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. క్యూర్ లో ఇందిరమ్మ టవర్స్ టెండర్ పక్రియ ప్రారంభం చేస్తామన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి విడతలో 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మరో 4 నియోజకవర్గాల్లో స్థలాల గుర్తింపు పూర్తయిందని చెప్పారు. లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఆగస్టు 10వ తేదీ తర్వాత ఈ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేదన్నారు. ఆధార్‌తో పాటు ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్ కూడా చెల్లుబాటు అవుతుందని వివరించారు. ఇల్లు రాకపోతే రూ.10 వేల ఈఎండీ 100 శాతం రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లిస్తే అదే ఖాతాకు నగదు రీఫండ్ చేస్తామని చెప్పారు. ఒక్కో ప్లాట్ మార్కెట్ విలువ రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉందని వివరించారు. లబ్దిదారుల పేరుపై 20 నుంచి 22 గజాల అన్‌డివైడెడ్ షేర్ ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఫలక్‌నుమా ప్యాలెస్ సమీపంలోనూ ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. పేదలకు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి తెలిపారు.



# ప్రధానమంత్రి సూర్య సరోవర్ యోజనకు 5,070 కోట్లు

మొదటి పేజీ తరువాయి...

వినియోగించనున్నారు. సముద్రం అడుగున దాగున్న ముడిచమురు, సహజవాయువు వనరుల గుర్తింపు కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఖేలో ఇండియా పథకానికి సంబంధించి కేంద్రం రాబోయే ఐదేళ్ల కాలానికి రూ.29,054 కోట్లు కేటాయించిందని కూడా మంత్రి తెలిపారు. యూనీ డైరెక్షనల్ ట్విన్ ట్యూబ్ టన్నుల్స్ నిర్మాణానికి 9,779 కోట్ల రూపాయలు కేటాయించామని చెప్పారు.

# ప్రధాని మోడీ వీడియో మార్ఫింగ్

### మెటాపై సైబర్ క్రైమ్ పోలీసుల కేసు

### పులువురు సోషల్ మీడియా యూజర్లపైనా కేసు

**హైదరాబాద్, జులై 31 (ప్రభాత ఉదయం)**

భారత ప్రభుత్వం, ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' మధ్య కొనసాగుతున్న వివాదం మరింత ముదిరింది. కేంద్ర మంత్రిత్వ శాఖ గురువారం మెటాకు మరోసారి నోటీసులు జారీ చేయగా, తాజాగా హైదరాబాద్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. మెటా ఇండియా హెడ్ అరుణ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సోషల్ మీడియా యూజర్లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి సంబంధించిన ఓ వీడియోను ఎఐ సాంకేతికతతో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేసినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్యలు తీసుకున్నారు.సీజేపీ నిరసన సమయంలో ప్రధాని మోడీ షేర్ చేసిన వీడియోను కొందరు ఎఐ సహాయంతో ఎడిట్ చేసి, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని ప్రచారం చేశారని పోలీసులు తెలిపారు. మెటా యాజమాన్యంలోని ఫేస్‌బుక్,



ఇన్‌స్టాగ్రామ్‌లలో ఈ మార్ఫింగ్ వీడియోలు వైరల్ అయినట్లు విచారణలో తేలింది. ఈ విజువల్స్ ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, నూతన భారతీయ న్యాయ సంహిత , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. ఈ డీప్‌ఫేక్ వీడియోలను ఎవరు సృష్టించారు? సోషల్ మీడియాలో ఇవి అంత విస్తృతంగా ఎలా వ్యాపించాయి? ఎ÷-లాట్‌ఫామ్స్ వద్ద ఉన్న భద్రతా చర్యలు వీటిని అడ్డుకోవడంలో సరిపోలేదా? అనే కోణంలో సైబర్ క్రైమ్ పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. వీటిని రూపొందించి, షేర్ చేసిన ప్రతి ఒక్కరి పాత్రపై ఆరా తీస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మెటా ప్రతినిధులను పిలిపించి, ఎ÷-లాట్‌ఫామ్‌లలో ంఎ స్కామ్‌లు, నకిలీ ప్రకటనలు, మార్ఫింగ్ కంటెంట్‌ను గుర్తించి తొలగించే పక్రియపై వివరణ కోరారు. దీనిపై స్పందించిన మెటా ప్రతినిధులు అధికారుల ముందు హాజరై, తమ వద్ద ఉన్న కంటెంట్ మోడరేషన్ విధానాలు, నిబంధనల వివరాలను సమర్పించారు. ప్రస్తుతం ఈ విచారణ ప్రాథమిక దశలోనే ఉందని పోలీసులు స్పష్టం చేశారు. డిజిటల్ ఆధారాల ప్రకారమే అన్ని ఆరోపణలను పరిశీలిస్తామని, ప్రస్తుతం ఎవరిపై నేరం రుజువు కాలేదని, దర్యాప్తు ఫలితాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

# విదేశీ విద్యార్థులపై ఫీజుల పిడుగు

### లక్ష డాలర్ల ఫీజుపై ట్రంప్ కసరత్తు

**న్యూయార్క్,జులై31 (ప్రభాత ఉదయం)**

అంతర్జాతీయ విద్యార్థుల నుంచి ట్రంప్ సర్కారు లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేసే ప్రణాళిక వేసింది. అమెరికా వర్సిటీల్లో విద్యాభాస్యం పూర్తి చేసిన తర్వాత అక్కడే పని చేయాలను కుంటున్న స్టూడెంట్స్ నుంచి లక్ష డాలర్లు వసూల్ చేసే ఆలోచనలో ట్రంప్ సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది. వాల్ స్ట్రీట్ జర్నల్ దీనిపై కథనాన్ని రాసింది. హెచ్1-బీ వీసాదారుల నుంచి లక్ష డాలర్ల ఫీజు వసూల్ చేయాలన్న ప్రతిపాదనను అమెరికా కోర్టు కొట్టివేయడంతో.. ట్రంప్ సర్కారు కొత్త మార్గాన్ని అన్వేషిస్తున్నది. విద్యార్థులకు ఇచ్చే ఎఫ్-1 వీసాలకు ఎక్స్‌టెన్షన్‌గా భావించే ఆప్టికల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై అధిక ఫీజును వసూల్ చేయాలని ఆ దేశ హోంశాఖ భావిస్తున్నట్లు ద వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో వెల్లడించింది. ఓపీటీ ప్రోగ్రామ్ ప్రకారం విదేశీ విద్యార్థులు తాము విద్యను పూర్తి చేసుకున్న ప్రాంతంలో సుమారు మూడేళ్ల వరకు పనిచేసే అవకాశం ఉంటుంది. 2024 నాటి రికార్డుల



ప్రకారం సుమారు 4 లక్షల 19వేల విదేశీ విద్యార్థులు ఓపీటీ స్కీమ్ కింద అమెరికాలో పనిచేస్తున్నట్లు తెలిసింది. హెచ్1-బీ వీసాదారులపై లక్ష డాలర్ల ఫీజును వసూల్ చేయడాన్ని అమెరికాలోని టెకీ కంపెనీలు వ్యతిరేకించాయి. అమెరికా వర్సిటీల్లో చదివే విద్యార్థులకు ఆ కంపెనీలే ఎక్కువ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటాయి.

# భారత్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు

**మొదటి పేజీ తరువాయి...**

చైనా మద్దతు ప్రకటించిన నేపథ్యంలో జిన్‌పింగ్ ఢిల్లీలో జరిగే శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యే అవకాశం ఉందని ఈ పరిణామాలపై అవగాహన ఉన్న వర్గాలు తెలిపినట్లు సమాచారం. అయితే జిన్‌పింగ్ భారత పర్యటనపై ఇప్పటివరకు చైనా లేదా భారత్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ బ్రిక్స సదస్సుకు హాజరు కావాలని చైనా అధ్యక్షుడికి భారత్ ఇప్పటికే అధికారిక ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, దేశాల మధ్య సహకారానికి బ్రిక్స్ ఒక ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. బ్రిక్స్ సహకారానికి చైనా అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ కూటమి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందని తెలిపారు.

ఈ ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్. శిఖరాగ్ర సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చైనా పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలో జరగనుంది. ఈ సమావేశానికి జిన్‌పింగ్ హాజరుపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. జిన్‌పింగ్ భారత్‌కు వస్తే.. 2020 గల్వాన్ ఘర్షణ తర్వాత ఆయన చేపట్టే తొలి భారత పర్యటనగా ఇది నిలవనుంది. చివరిసారిగా జిన్‌పింగ్ 2019 అక్టోబర్‌లో భారత్‌లో పర్యటించారు. ఆ సమయంలో తమిళనాడులోని మామల్లపురంలో ప్రధాని మోడీతో రెండో అనధికారిక శిఖరాగ్ర సమావేశం నిర్వహించారు. అనంతరం 2020లో గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవ డంతో భారత్-చైనా సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరోవైపు ప్రధాని మోడీ 2025లో చైనాలో పర్యటించారు. టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ప్రధాని మోడీ చైనాలో పర్యటించడం ఇదే తొలిసారి. బ్రిక్స శిఖరాగ్ర సమావేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా భారత్‌కు వచ్చే అవకాశం ఉందని క్రెమ్లిన్ ఇప్పటికే ధ్రువీకరించింది. బ్రిక్స్ సభ్యదేశమైన ఇరాన్ కూడా సమావేశంలో పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే ఇరాన్ నుంచి ఏ స్థాయి ప్రతినిధి బృందం హాజరవుతుందన్న విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా బంగ్లాదేశ్ కూడా బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో అత్యున్నత స్థాయిలో పాల్గొనే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. న్యూఢిల్లీలో జరగనున్న బ్రిక్స్ సదస్సుకు హాజరు కావాలని బంగ్లాదేశ్ ప్రధానికి ప్రధాని మోడీ ఆహ్వానం పంపినట్లు తెలుస్తోంది. ఈ ఆహ్వానాన్ని ప్రస్తుతం సమీ క్షిస్తున్నామని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రహ్మాన్ బుధవారం తెలిపారు. బ్రిక్స్ కూటమిలో తొలుత బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సభ్యదేశాలుగా ఉన్నాయి. 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ దేశాలు బ్రిక్స్ లో చేరాయి. 2025లో ఇండోనేషియా కూడా కూటమిలో సభ్యత్వం పొందింది. ప్రస్తుతం విస్తరించిన బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తుండటంతో సెప్టెంబర్‌లో న్యూఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సమావేశంపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

## సురక్షితమైన ఆహార వ్యవస్థను వినియోగదారులకు

# అందించేందుకు కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలు

### ఉద్యాన విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డి. రాజి రెడ్డి

**బుద్వేల్, జూలై 31 (ప్రభాత ఉదయం) :**

రోజురోజుకు పెరుగుతున్న పురుగుమందు అవశేషాల నేపథ్యంలో సురక్షితమైన ఆహార వ్యవస్థను వినియోగదారులకు అందించేందుకుగాను కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలు అందుబాటులోకి తీసుకురావాలని, పురుగు తెగుళ్ల యాజమాన్యంలో సుస్థిర పద్ధతులపై పరిశోధన ముమ్మరం చేయాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స లర్ డాక్టర్ డి. రాజి రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ లోని ఉద్యాన కళాశాల వేదికగా జరిగిన సుస్థిర పురుగు తెగుళ్ల యాజమాన్య పద్ధతుల పై జరిగిన వర్క్ షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణలో ముమ్మరంగా సాగవుతున్న ఆయిల్ పామ్ యాజమాన్యం లో సైతం భవిష్యత్తులో జీవన ఆధారిత సమగ్ర యాజమాన్య పద్ధతులతో పురుగు, తెగుళ్ల ను కట్టడి చేయాలని ఆయన అన్నారు. మామిడిలో తామర పురుగు, జామలో పిండి నల్లి, టమాటాలో సూది పురుగు, వంకాయలో కాయ, కొమ్మ తొలుచు పురుగు యాజమాన్యానికై జరిగిన పరిశోధన ఆవిష్కరణలను త్వరలోనే రైతులకు అందజేస్తామని అన్నారు. భవిష్యత్తులో రసాయనేతర యాజమాన్య పద్ధతులు రైతులకు అందుబాటులో తెచ్చేందుకు పరిశోధనలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ పరిశోధనా సంచాలకులు డాక్టర్ డి లక్ష్మీనారాయణ, డీన్ డా.జే. చీనా, పీజీ డీన్ డాక్టర్ టి. సురేష్, ఏ టి జి సి బయోటిక్ గ్లోబల్ ఎండి రోనాల్డ్, ఇండియన్ ఎండి మార్కండేయ, కో ఫౌండర్ డాక్టర్ వి. భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ ప్లానింగ్ అండ్ మానిటరింగ్ అనిత కుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు




సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు




## రాజేంద్రనగర్ నూతన స్టేషన్ హౌస్ అధికారికి బీజేపీ నేతల శుభాకాంక్షలు

**రాజేంద్రనగర్,జులై31(ప్రభాత ఉదయం)**


రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు నూతనంగా నియమితులైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆర్.వెంకటేశ్ ను భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా బిజెపి నాయకులు పోలీస్ స్టేషన్ కు చేరుకొని ఆర్.వెంకటేశ్,ను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా స్వీట్లు అందజేసి నూతన బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యదర్శి పొన్నమోని మల్లేష్ యాదవ్,రంగారెడ్డి జిల్లా బిజెపి ఆఫీస్ సెక్రెటరీ సాబాద విజయ్ కుమార్,రంగారెడ్డి జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు కాకులారం కృష్ణ కిట్టు,అత్తాపూర్ డివిజన్ పూర్వ అధ్యక్షులు స్టార్ చిన్న శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజలకు అండగా ఉండాలి..**

ఈ సందర్భంగా నారగూడెం మల్లారెడ్డి మాట్లాడుతూ...రాజేంద్రనగర్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.నూతన ఎస్.హెచ్.ఓ ఆర్.వెంకటేశ్ అనుభవం,నిబద్ధతతో ప్రజలకు మరింత చేరువగా ఉంటూ చట్టాన్ని కాపాడాలని సూచించారు.మహిళల భద్రత,యువతలో మాదకద్రవ్యాల నివారణ,సైబర్ నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

**పార్టీ శ్రేణులతో కలిసి పని చేస్తాం..**

పొన్నమోని మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ...పోలీస్ శాఖకు పార్టీ శ్రేణులు అన్ని విధాలుగా సహకరిస్తాయని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్,ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.స్పందించిన ఆర్.వెంకటేశ్ తనకు అప్పగించిన బాధ్యతలను నిజాయితీగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు.చట్టానికి లోబడి ఎవరైనా సరే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ఎస్.హెచ్.ఓ కు అభినందనలు తెలియజేశారు.





సులేమాన్ నగర్, చింతల్ మెట్ లలో పర్యటించి సీసీ కెమెరాలు, శాంతి భద్రత లపై తెలుసుకుంటున్న అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య

# సులేమాన్ నగర్‌లో ఇన్స్‌పెక్టర్ ఎ సీతయ్య పర్యటన

**బుద్వేల్, జూలై 31 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతల్మెట్, సులేమాన్ నగర్ బస్తీ లలో సీసీ టీవీలు సరిగ్గా పనిచేస్తున్నాయా.. లేదా అని శుక్రవారం ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య పరిశీలించారు. ఆ ప్రాంతాలలో ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరైన గంజాయి సేవించి ఇబ్బందులకు గురి చేస్తున్నారా.. అని వాకబు చేశారు. రౌడీ షీటర్లు ఎవరైన గొడవలకు పాల్పడుతున్నారా.. అనే కోణాలలో వివరాలు సేకరించారు. అన్ని బస్తీలు, కాలనీలలో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూస్తామన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఎవరు గొడవలకు పాల్పడినా, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మజ్లిస్ పార్టీ నాయకులు, రాజేంద్రనగర్ వాస్తవ్యులు మహ్మద్ మూర్తుజా అలీ కుమార్తె నిశ్చితార్థం లో శాసన మండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్, మజ్లిస్ నాయకులు మహ్మద్ నవాజుద్దీన్, హబీబ్ జైన్ ఆరిఫ్, తాహెర్, తదితరులు

## టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ డిపార్ట్మెంట్ కన్వీనర్ దేశాల దివ్యశ్రీని సన్మానించిన శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు రాచమల్ల సురేష్



దేశాల దివ్యశ్రీ ని సన్మానిస్తున్న శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు రాచమల్ల సురేష్, తదితరులు



దివ్యశ్రీ ని సన్మానిస్తున్న అప్పారెడ్డి గూడెం భీమయ్య



దివ్యశ్రీ కు మిఠాయి తినిపిస్తున్న రాచమల్ల సురేష్

**బుద్వేల్ , జూలై 31 (ప్రభాత ఉదయం) :**

టీపీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ డిపార్ట్మెంట్ రాష్ట్రకన్వీనర్ గా నియమితులైన దేశాల దివ్య శ్రీ ని శుక్రవారం శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు రాచమల్ల సురేష్ సన్మానించారు. రాజేంద్రనగర్ ఇంద్రారెడ్డి నగర్ లో గల దేశాల దివ్యశ్రీ నివాసం లో జరిగిన సన్మాన కార్యక్రమంలో దివ్యశ్రీ తండ్రి ఆర్ టీ ఐ కమిషనర్ దేశాల భూపాల్, తల్లి దేశాల పద్మ, విశ్వనాథం, చింటు, సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య లు ఉన్నారు.



పీడీపీ చౌరస్తాలో గల ఐ బీ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం రాత్రి జరిగిన మజ్లిస్ పార్టీ నాయకులు రాజేంద్రనగర్ వాస్తవ్యులు మహ్మద్ మూర్తుజా అలీ గారి కుమార్తె నిశ్చితార్థ వేడుకలో రాజేంద్రనగర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ (మజ్లిస్) అబ్దుల్ ఖదీర్ గారితో తీసుకున్న ఫోటో. 2000 నుంచి 2005 వరకు వీరు వైస్ చైర్మన్ గా పని చేశారు.

## భద్రాద్రి వద్ద గోదావరి ఉగ్రరూపం

### భారీగా వచ్చి చేరుతున్న వరదనీరు

**భద్రాద్రి కొత్తగూడెం,జూలై31 (ప్రభాత ఉదయం) :**

భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ఉదయం భద్రాచలం వల్ల గోదావరి నీటి మట్టం 44 అడుగులకు చేరింది. 9,74,666 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. దీంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో కల్యాణకట్ట, స్నాన ఘట్టాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో రాబోయే గంటల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికార వర్గాలు సూచించాయి. గోదావరి నీటి మట్టం అంతకంతకూ పెరుగుతుండటంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధికారులు సిద్ధంగా ఉన్నారు. ప్రజలు ఎవరూ కూడా గోదావరి వైపుకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు.



ఆర్టీసీ లో ఉద్యోగ విరమణ పొందిన సి అనంతయ్య ను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు ఏ పీ రెడ్డి, అంజయ్య, తదితరులు



అనంతయ్య దంపతులను సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు



అనంతయ్య ను సన్మానిస్తున్న సీనియర్ రిపోర్టర్ అప్పారెడ్డి గూడెం భీమయ్య

# ఆర్టీసీలో ఉద్యోగ విరమణలు

**బుద్వేల్, జూలై 31 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో లో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని డిపో లో ఘనంగా సన్మానించారు. ఆర్టీసీ లో 35 సంవత్సరాలుగా వివిధ హోదాలలో పనిచేసిన సి అనంతయ్య, వెంకటేశ్, అంజయ్య, బల్వీర్ సింగ్లు ఆర్టీసీ కి చేసిన సేవలను డిపో మేనేజరు బి క్రిష్ణారెడ్డి తో పాటు ఎంఎఫ్ నీలిమ, ఎస్ టి ఐ సుశీల లతో పాటు ఉద్యోగ సంఘాల నాయకులు ఎం హెచ్ అలీ, ఏపీ రెడ్డి, అంజయ్య లతో పాటు విశ్రాంత ఉద్యోగులు పుస్తకాల శ్రీశైలం, సీనియర్ రిపోర్టర్ అప్పారెడ్డి గూడెం భీమయ్య, తదితరులు సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు సైతం డిపో లో జరిగిన ఉద్యోగ విరమణ సన్మాణ సభ లో పాల్గొని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎం బి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ, డిపో లో ని అనంతయ్య అందరితో కలుపుకోలుగా ఉంటు విధులను నిర్వహించారన్నారు. ఆయన ఆర్టీసీ కి చేసిన సేవలు మరిచిపోలేనివన్నారు. వెంకటేశ్, అంజయ్య, బల్వీర్ సింగ్లు కూడా ఆర్టీసీ కి పేరు తెచ్చే విదంగా పనులు చేశారన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నామన్నారు.

# జూరాల ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు









### వరద పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలి.. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం

### కర్ణాటక నుంచి భారీగా వస్తున్న వరద నీరు.. 24 గేట్ల ద్వారా నీటి విడుదల

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(ప్రభాత ఉదయం)**

వర్షాలు, వరదల నేపథ్యంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్యతో కలిసి జూరాల ప్రాజెక్ట్‌ను సందర్శించారు. కృష్ణా నదికి కర్ణాటక రాష్ట్రం నుంచి వస్తున్న వరద ప్రవాహాన్ని, ప్రాజెక్ట్‌లోని నీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు ప్రస్తుత వరద ప్రవాహం, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో, ఎత్తిన గేట్లు, భవిష్యత్‌లో ఏర్పడే పరిస్థితులపై ఎస్పీకి వివరించారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్ట్‌కు సుమారు 1,30,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1,15,515 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్‌లో 64 గేట్లు ఉండగా, ప్రస్తుతం 24 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తునట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కృష్ణా నదికి వచ్చే వరదలు, భారీ వర్షాల కారణంగా ఎలాంటి విపత్తు ఎదురైనా పోలీస్ శాఖ తక్షణమే స్పందించి ప్రజలను రక్షించేందుకు సిద్ధంగా ఉందన్నారు. కర్ణాటక నుంచి వరద ప్రవాహం మరింత పెరిగిన పక్షంలో జిల్లాలోని ఆరు గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున, ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. వరదలు, భారీ వర్షాల సమయంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అవసరమైన సందర్భాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, ఏఈలు సుదర్శన్, సిద్దయ్య, కిషోర్ కుమార్, గద్వాల రూరల్ ఎస్ఐ సీహెచ్. శ్రీకాంత్, ధరూర్ ఎస్ఐ నందీకర్ తదితరులు పాల్గొన్నారు.



శానిటేషన్ సిబ్బంది తో కలసి నాలాను శుభ్రం చేస్తున్న అంజనేయులు సాగర్ కాలనీ వాసులు..

## గుల్షన్ నగర్‌లో నాలా డ్రైనేజీ మురుగు, చెత్తను శుభ్రం చేయించిన అధికారులు!

### ఆంజనేయులు సాగర్ చొరవతో కదిలిన జీహెచ్ఎంసీ యంత్రాంగం

### -- డీసీ బాలకృష్ణ, ధన్యవాదాలు

**శేరిలింగంపల్లి : జూలై 31, (ప్రభాత ఉదయం)**

గుల్షన్ నగర్ బస్తీవాసులకు ఎన్నో రోజులుగా వేధిస్తున్న నాలా సమస్యకు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. నాలాలో భారీగా పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక వల్ల స్థానికులు పడుతున్న తీవ్ర ఇబ్బందులను గుర్తించిన అంజయ్య నగర్ డివిజన్ నాయకుడు ఆంజనేయులు సాగర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇటీవల మాదాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ ని స్వయంగా కలిసి సమస్య తీవ్రతను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన అధికారులు విషయాన్ని తీవ్రంగా పరిగణించిన నాలాలోని చెత్తను తక్షణమే తొలగించాలని సంబంధిత ఏఈ రాకేష్ డీసీ ఆదేశించారు. అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక శానిటేషన్ బృందం, అవసరమైన వాహనాలు, యంత్రాలతో గుల్షన్ నగర్‌కు చేరుకుని నాలాలోని చెత్తను, మురుగును పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు.

**అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు**

నాలా శుభ్రత పనులు విజయవంతంగా పూర్తి కావడంతో ఆంజనేయులు సాగర్ ఆనందం వ్యక్తం చేశారు. అంజయ్య నగర్ డివిజన్, గుల్షన్ నగర్ పీజేఆర్ నగర్ కాలనీ ప్రజల తరఫున డీసీ బాలకృష్ణకి, ఏఈ రాకేష్ క్షేత్రస్థాయిలో కష్టపడిన శానిటేషన్ సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..**

ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే ప్రతి చిన్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే మా ప్రధాన లక్ష్యం. ప్రజా సమస్యలపై ప్రతిసారీ ఇదే రీతిలో వేగంగా స్పందిస్తూ, ప్రజలతో సమన్వయంగా పనిచేస్తూ శాశ్వత పరిష్కారాలు చూపాలని అధికారులను కోరుతున్నాం. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తాం అని పేర్కొన్నారు. ఈ నాలా శుభ్రత కార్యక్రమంలో స్థానిక నాయకులు, బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అధికారుల తీరుపై ప్రశంసలు కురిపించారు.

### డా. నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్

## దేశానికే గర్వకారణం: కేంద్ర హోంమంత్రి అమిత్ షా

**హైదరాబాద్,జూలై31 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు (వైద్యం), ప్రముఖ ఆంకాలజిస్ట్, క్యాన్సర్ వైద్య నిపుణులు డా. దత్తాత్రేయుడు నోరికి భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రదానం చేయడం పట్ల కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. వైద్య రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా దక్కిన ఈ పురస్కారం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, డా. నోరికి హోంమంత్రి ఒక ప్రత్యేక అభినందన లేఖను పంపారు. క్యాన్సర్ చికిత్స, పరిశోధన రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా కొత్త ప్రమాణాలు నెలకొల్పి, ఎంతో మందికి పునర్జన్మ ప్రసాదించిన డా. నోరి సేవలను అమిత్ షా ఈ లేఖలో విశేషంగా కొనియాడారు. విజ్ఞానం, సేవ, సహానుభూతి కలబోసిన ఆయన వైద్య ప్రయాణం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పద్మ పురస్కారాలకు సరికొత్త అర్థం చేకూరిందని హోంమంత్రి స్పష్టం చేశారు. ప్రశంసల కోసం కాకుండా, సమాజ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసే నిజమైన మౌన సాధకులకు, కర్మయోగులకు నేడు ఈ జాతీయ పురస్కారాలు దక్కుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రోగుల సంక్షేమం పట్ల డా. నోరి కనబరుస్తున్న అంకితభావం కేవలం ఒక వ్యక్తిగత విజయం కాదని, అది స్వార్థరహిత విలువలపై నిలబడి దేశ ప్రగతికి దిశానిర్దేశర చేసే దేశభక్తికి నిదర్శనమని హోంమంత్రి అన్నారు. పరోపకారం విశిష్టతను తెలిపే సంస్కృత శ్లోకాన్ని ఉదహరించిన శ్రీ అమిత్ షా... డా. నోరి సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో మరింత కాలం పాటు సమాజానికి తన అమూల్యమైన సేవలను అందించాలని ఆకాంక్షించారు.



## పేకాట రాయుళ్లు అరెస్టు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(ప్రభాత ఉదయం)**

గట్టు మండల పరిధిలోని బోయలగూడెం శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం గట్టు పోలీసులు దాడి చేయగా 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శేఖర్ గౌడ్ తెలిపారు. పోలీసులు నిర్వహించిన ఈ దాడుల్లో నిందితుల నుండి ₹44,110 నగదు, 6 మొబైల్ ఫోన్లు మరియు 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## శాకంబరీ దేవి అలంకారంలో గద్వాల కన్యకా పరమేశ్వరి అమ్మవారు

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 31(ప్రభాత ఉదయం)**



ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా గద్వాల్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలచే విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆలూరు బిలకంటి రాము మాట్లాడుతూ --- సకల జీవుల ఆకలి తీర్చి, అందరినీ సమాన ప్రేమతో ఆదరించేందుకే జగన్మాత శాకంబరీ అవతారం ఎత్తిందని, అమ్మవారి కృపతో అందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ పూజలకు అలంకరణ దాతలుగా పూరి రాధిక-తిరుమలేష్, అల్పాహార దాతలుగా మరిడి సుమలత-శ్రీకాంత్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి నరహరి శ్రీనివాసులు, కోశాధికారి పత్తి రత్నాకర్, సభ్యులు కొండా రాఘవేంద్ర, వజ్రాల రాజేష్ మరియు పట్టణ ప్రజలు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



## దుర్గమ్మ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు జూలై 31 (ప్రభాత ఉదయం)**

అమీన్ పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామంలో గల శ్రీశ్రీశ్రీ ఏడుపాయల దుర్గమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం నిర్వహించిన కళ్యాణ మహోత్సవం, బోనాల కార్యక్రమంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి,సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, దర్శన్, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ చేసిన బెటాలియన్ కమాండెంట్ కు గౌరవ వందన సమర్పణ చేస్తున్న పోలీసు సిబ్బంది..

### నాలుగు దశాబ్దాలు

## విశిష్ట సేవలు చిరస్మరణీయం

### 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ పదవీ విరమణ

### ముఖ్య అతిథిగా హాజరైన అమెరికన్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్

**శేరిలింగంపల్లి : జూలై 31,(ప్రభాత ఉదయం)**

నాలుగు దశాబ్దాలకు పైగా పోలీస్ శాఖలో క్రమశిక్షణ, అంకితభావం, అసమాన నిజాయితీతో సేవలు అందించి అందరికీ ఆదర్శంగా నిలిచిన తెలంగాణ స్పెషల్ పోలీస్ 8వ బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణ సుదీర్ఘ 42 సంవత్సరాల సేవా ప్రయాణం పూర్తి చేసుకుని ఘనంగా పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బెటాలియన్ ఆవరణలో శుక్రవారం ఆయనకు అత్యంత వైభవంగా వీడ్కోలు సభను నిర్వహించారు. ఈ వేడుకకు అమెరికన్ కాన్సులేట్ జనరల్ లారా విలియమ్స్ ముఖ్య అతిథిగా హాజరై కమాండెంట్ రామకృష్ణను శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా లారా విలియమ్స్ మాట్లాడుతూ రామకృష్ణ నాలుగు దశాబ్దాల పాటు ప్రజలకు,అందించిన విశిష్ట సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనంతర జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.

**అకట్టుకున్న గౌరవ పరేడ్:**

పదవీ విరమణ సందర్భంగా బెటాలియన్ కవాతు మైదానంలో నిర్వహించిన ప్రత్యేక పరేడ్ అందరినీ ఆకట్టుకుంది. అసిస్టెంట్ కమాండెంట్ డి. సత్యనారాయణ నాయకత్వంలో నిర్వహించిన ఈ పరేడ్‌లో అధికారులు కమాండెంట్ రామకృష్ణకు గౌరవ వందనం సమర్పించారు.

**సిబ్బంది సహకారం మరవలేనిది: రామకృష్ణ**

సన్మాన గ్రహీత, కమాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ తన 42 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహోద్యోగులు, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు, దేశానికి సేవ చేసే అవకాశం దక్కడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని చెప్పారు. క్రమశిక్షణ, సేవాభావమే పోలీస్ రంగానికి మూలస్తంభాలని, బెటాలియన్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. రాంబాబు మాట్లాడుతూ బెటాలియన్ అభివృద్ధిలో కమాండెంట్ రామకృష్ణ కృషి చిరస్మరణీయమని కొనియాడారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు వి. అనిల్ కుమార్, సత్యనారాయణ, నరేందర్, రాంబాబులతో పాటు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, యూనిట్ మెడికల్ ఆఫీసర్లు, ఇతర అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




పదవి విరమణ చేసిన పోలీసు సిబ్బందితో సీపీ ఇతర అధికారులు...

## జీవితాంతం ప్రజాసేవకే అంకితం..

## సైబరాబాద్ లయన్స్‌కి ఘన వీడ్కోలు

### సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ పొందిన ఏడుగురు అధికారుల సన్మానం

**శేరిలింగంపల్లి : జూలై 31, (ప్రభాత ఉదయం)**

శాంతి భద్రతల పరిరక్షణ కోసం తమ విలువైన జీవితాలను, కాలాన్ని ధారపోసి.. ఖాకీ దుస్తుల వెనుక అతులితమైన ప్రజాసేవా నిరతిని చాటుకున్న అధికారులు సమాజానికి దిశానిర్దేశకులని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ యం. రమేష్ కొనియాడారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి శుక్రవారం పదవీ విరమణ పొందిన ఏడుగురు పోలీసు అధికారులకు కమిషనరేట్ ఆడిటోరియంలో ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కమిషనర్ రమేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిరంతరం ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ, నేర నియంత్రణలోనూ ప్రజా సేవలోనూ వీరు చూపిన చొరవ ప్రశంసనీయం. పోలీసు శాఖ అభివృద్ధికి వీరు చేసిన కృషి మరువలేనిది. సుదీర్ఘ సర్వీస్ పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందుతున్న వీరు ఇకపై తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షిస్తునన్నారు. తమ సుదీర్ఘ అనుభవాన్ని సమాజ శ్రేయస్సు కోసం కూడా వినియోగించాలి అని పిలుపునిచ్చారు. సన్మాన గ్రహీతలను కమిషనర్ ఇతర ఉన్నతాధికారులు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి, వారి సేవాభావానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం అడ్మిన్ డీసీపీ అన్నపూర్ణ, స్పెషల్ బ్రాంచ్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర, సైబర్ క్రైమ్ డీసీపీ కె. పుష్ప, డీసీపీ (కార్ హెడ్‌క్వార్టర్స్) పి. సంజీవ్, ఏడీసీపీ షమీర్, సీఏఓ వెంకట్ రెడ్డి, ఏఓ వై.వి.ఎస్. జ్యోతిర్మణి, ఆర్ఐ హిమాకర్, సొసైటీ ఇన్ ఛార్జ్ ఎస్ఐ జి. మల్లేశంలతో పాటు విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచర సిబ్బంది పాల్గొని వీడ్కోలు తెలిపారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్‌కు ఘన సన్మానం

### శేరిలింగంపల్లి బీసీల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ -- ప్రభాకర్ యాదవ్

**కూకట్ పల్లి, జూలై 31(ప్రభాత ఉదయం)**



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన ప్రభాకర్ యాదవ్ ను శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ సర్కిల్ బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. భారతీయ జనతా పార్టీ ఓబీసీ నాయకులు అక్కినపల్లి సాయికుమార్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు, ములుగు జిల్లా ఇన్‌చార్జ్ డాక్టర్ కొనదాల నరేష్ హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కినపల్లి సాయికుమార్ మాట్లాడుతూ, ప్రభాకర్ యాదవ్ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టడం శేరిలింగంపల్లి ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు. మంచి వ్యక్తిత్వం, ఓర్పు, సహనం కలిగిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ప్రజల సమస్యలపై స్పందించే నాయకత్వం కలిగిన ప్రభాకర్ యాదవ్ వంటి వ్యక్తి రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు చేపట్టడం బీసీ సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, తనకు రాష్ట్ర పార్టీ కల్పించిన ఈ బాధ్యత ఎంతో గౌరవప్రదమైనదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు, వారి హక్కులు, సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. ముఖ్యంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని వర్గాల బీసీల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీసీ యువతకు ఉపాధి, విద్య, సామాజిక సాధికారత, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక దృష్టి సారిస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల సహకారంతో ప్రజలకు మరింత చేరువై సేవా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా డాక్టర్ కొనదాల నరేష్ మాట్లాడుతూ, ప్రభాకర్ యాదవ్ రాష్ట్ర స్థాయిలో మరింత సమర్థవంతంగా పనిచేసి బీసీ వర్గాల ఆకాంక్షలను నెరవేర్చాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి నాయకుడు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రభాకర్ యాదవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన నాయకత్వంలో ఓబీసీ మోర్చా రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శి కళ్యాణి దుర్గాప్రసాద్, పాపిరెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షుడు బాలు యాదవ్, ఆల్విన్ కాలనీ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్ల బీజేపీ ముఖ్య నాయకులు, ఓబీసీ మోర్చా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సన్మాన కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపగా, శేరిలింగంపల్లి ప్రాంతంలో బీసీ వర్గాల అభివృద్ధికి మరింత సమన్వయంతో పనిచేయాలనే సంకల్పాన్ని నాయకులు వ్యక్తం చేశారు.

# అమెరికా మార్కెట్ చరిత్రలో మైక్రోసాఫ్ట్ రికార్డు

### 450 బిలియన్ డాలర్లు పెరిగిన మార్కెట్ విలువ







**న్యూయార్క్,జులై 31(ప్రభాత ఉదయం)**

అమెరికా మార్కెట్ చరిత్రలోనే మునుపెన్నడూ లేని ఒక అద్భుతమైన రికార్డు నమోదైంది. టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఏకంగా ఒక్క రోజులోనే తన మార్కెట్ విలువకు దాదాపు 450 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.39 లక్షల కోట్లు పెంచుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. వాల్ స్ట్రీట్ ట్రేడింగ్ చరిత్రలో ఏ ఒక్క నమోదిత కంపెనీ కూడా ఒక్క రోజు ఈ స్థాయిలో మార్కెట్ విలువను పెంచుకోలేదు. ఈ సంచలన ర్యాలీతో మైక్రోసాఫ్ట్.. ప్రముఖ ఏఐ చిప్‌మేకర్ 'ఎన్విడియా' ను వెనక్కి నెట్టి ప్రపంచంలోనే అత్యంత విలువైన పబ్లిక్ లిస్టెడ్ కంపెనీగా మళ్లీ తన స్థానాన్ని కైవసం చేసుకుంది. త్రైమాసిక ఆర్థిక ఫలితాల వెల్లడి తర్వాత మైక్రోసాఫ్ట్ షేర్లు ఒక్కసారిగా 9 శాతం పెరిగాయి. ఫలితంగా ఒక్క రోజులోనే పొందిన ఈ అదనపు మార్కెట్ విలువ, దక్షిణాఫ్రికా, వియత్నాం, టర్కీ వంటి దేశాల మొత్తం స్టాక్ మార్కెట్ విలువల కంటే చాలా పెద్దది కావడం విశేషం. ఈ చరిత్రాత్మక ర్యాలీ వెనుక ఉన్న ప్రధాన కారణం మైక్రోసాఫ్ట్‌కు చెందిన 'అజూర్' క్లౌడ్ బిజినెస్. విశ్లేషకులు ఊహించిన దానికంటే అజూర్ క్లౌడ్ ఆదాయం మెరుగైన వృద్ధిని కనబరిచింది. గత కొద్ది కాలంగా మైక్రోసాఫ్ట్ ఏఐ మౌలిక వసతులు, డేటా సెంటర్లు, చిప్‌లపై బిలియన్ల కొద్దీ డాలర్లను గుమ్మరిస్తోంది. ఈ భారీ పెట్టుబడులు నిజంగానే లాభాలను తెచ్చిపెడతాయా అనే సందేహాలకు ఈ ఆర్థిక ఫలితాలు స్పష్టమైన సానుకూల సమాధానాన్ని ఇచ్చాయి. రాబోయే త్రైమాసికంలో కూడా ఏఐ-ఆధారిత క్లౌడ్ సేవల డిమాండ్ బలంగా ఉంటుందని కంపెనీ వేసిన అంచనాలు నిజమయ్యాయి. గత కొన్ని నెలలుగా.. టెక్ కంపెనీలు ఏఐ కోసం చేస్తున్న ఖర్చులను తగ్గించుకుంటాయేమోనని ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొంది. అయితే మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ విజయం ఆ అనుమానాలను పటాపంచలు చేసింది. కార్పొరేట్ ప్రపంచం ఏఐ సేవలకు భారీగా ఆర్డర్లు ఇస్తోందని, ఆ డిమాండ్‌ను అందుకోగల క్లౌడ్ సంస్థలకు ఇది బంగారు అవకాశమని నిరూపితమైంది. మైక్రోసాఫ్ట్ సాధించిన ఈ రికార్డు వృద్ధి.. ఎన్విడియా, అమెజాన్, ఆల్ఫాబెట్ (గూగుల్) వంటి ఇతర ఏఐ ఆధారిత దిగ్గజాలపై కూడా మార్కెట్ విశ్వాసాన్ని రెట్టింపు చేసింది.

# చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాతృమూర్తి రుక్కమ్మ మృతిపై టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపం

**కూకట్ పల్లి, జూలై 31(ప్రభాత ఉదయం)**



తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి గారి మాతృమూర్తి కీ.శే. పట్నం రుక్కమ్మ మరణవార్త తెలుసుకున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రుక్కమ్మ చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, కుటుంబానికి తల్లిని కోల్పోవడం ఎప్పటికీ పూడ్చలేని లోటని పేర్కొన్నారు. ఇలాంటి విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. రుక్కమ్మ ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎస్‌ఏటీ చైర్మన్, వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శివసేన రెడ్డి కూడా పాల్గొని పట్నం మహేందర్ రెడ్డి ని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రుక్కమ్మ మరణం పట్ల తమ సంతాపాన్ని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి కూడా కుటుంబ సభ్యులను కలిసి సానుభూతి తెలిపారు. రుక్కమ్మ సేవా భావం, కుటుంబ విలువలను గుర్తు చేసుకుంటూ, ఆమె మృతి కుటుంబానికే కాకుండా ఆమెను ఆదర్శంగా భావించిన అందరికీ తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, పట్నం మహేందర్ రెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. భగవంతుడు వారికి ఈ విషాదాన్ని తట్టుకునే ఆత్మస్థైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమం విషాద వాతావరణంలో జరిగింది. పార్టీ నాయకులు, శ్రేయోభిలా షులు, అనుచరులు పెద్ద సంఖ్యలో హాజరై రుక్కమ్మకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అందరూ రెండు నిమిషాల మౌనం పాటించి, దివంగత రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# గురు పౌర్ణమి వేడుకల్లో రమణ గురుస్వామికి ఘన సన్మానం

### అరుణ్ గురు స్వామి ఆశీస్సులతో భక్తుల సమక్షంలో ఆధ్యాత్మిక వేడుకలు

### స్వామి ఆశీర్వాదం పొందిన శిష్య బృందాలు

**కూకట్ పల్లి, జులై 31(ప్రభాత ఉదయం)**

గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆధ్యాత్మిక భక్తి, గురుభక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా అత్యంత వైభవంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మాన్యశ్రీ అరుణ్ గురు స్వామి వారి ఆశీస్సులతో రమణ గురు స్వామి వారి స్వగృహంలో, అనంతరం నారాయణ గురు స్వామి వారి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో గురు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో శిష్యులు, భక్తులు పాల్గొని గురువుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ పార్క్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా సాగాయి. బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాకు చెందిన శిష్య బృందంతో పాటు బీరంగూడ శిష్య బృందం కూడా విచ్చేసి కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. గురువుల పట్ల తమకున్న అపారమైన భక్తిని చాటుతూ రమణ గురు స్వామిని ఘనంగా సన్మానించి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అనంతరం రమణ గురు స్వామి శిష్యులను ఆశీర్వదిస్తూ, గురువు అనుగ్రహం జీవితానికి మార్గదర్శకమని, గురువు చూపిన సన్మార్గంలో నడిచిన వారికే నిజమైన ఆధ్యాత్మిక పరిపూర్ణత లభిస్తుందని పేర్కొన్నారు. గురు సేవ, భక్తి, వినయం, క్రమశిక్షణ ప్రతి శిష్యుడు జీవితంలో అలవరచుకోవాలని సూచించారు. శిష్యులు మాట్లాడుతూ, గురు పౌర్ణమి రోజున గురువులను స్మరించడం భారతీయ సంస్కృతిలో అత్యంత పవిత్రమైన సంప్రదాయమని, గురువు ఆశీస్సులతోనే జీవితంలో విజయాలు, శాంతి, ఆధ్యాత్మిక వికాసం సాధ్యమవుతాయని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా గురు పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తూ గురుభక్తిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియా శిష్య బృందం, బీరంగూడ శిష్య బృందం, భక్తులు, శిష్యులు, ఆధ్యాత్మిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని గురువులకు వందనాలు సమర్పించి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం మొత్తం భక్తి, ఆధ్యాత్మికత, గురు మహిమను చాటిచెప్పేలా ఎంతో వైభవంగా జరిగింది.



# తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు

### అమెరికాలోని వైనరీని పరిశీలించిన మంత్రి జూపల్లి

### రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో వైనరీల ఏర్పాటుకు అవకాశం

### ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం.. స్థానికంగా ఉపాధి అవకాశాలు

**హైదరాబాద్,జూలై31 31(ప్రభాత ఉదయం)**

తెలంగాణలో వైన్ టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని లీస్‌బర్గ్‌లో ఉన్న స్టోన్ టవర్ వైనరీని మంత్రి సందర్శించారు. సెల్లార్ టూర్‌లో పాల్గొని వైనరీ నిర్వహణ, వైన్ తయారీ పక్రియను అధ్యయనం చేశారు. అమెరికా పర్యటనలో భాగంగా వర్జీనియాలోని అష్‌బర్న్‌లో ఉన్న ఓ వైనరీని మంత్రి సందర్శించి, అక్కడి నిర్వహణ, వైన్ తయారీ విధానాలను అధ్యయనం చేశారు. వైనరీ ప్రతినిధులతో మాట్లాడి ద్రాక్ష సాగు, వైన్ తయారీకి అనువైన రకాలు, ప్రాసెసింగ్, ఫెర్మెంటేషన్, నిల్వ, బాట్లింగ్, నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. ద్రాక్ష తోటలు, వైనరీలను పర్యాటకంతో అనుసంధానిస్తూ గైడెడ్ టూర్లు, హాస్పిటాలిటీ, సందర్శకులకు ప్రత్యేక అనుభూతులను కల్పిస్తున్న విధానాన్ని పరిశీలించారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ద్రాక్ష తోటలు, వైనరీల ఆధారిత పర్యాటక అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు, ద్రాక్ష సాగుకు అనుకూలత, స్థలాల ఎంపిక, పెట్టుబడి నమూనాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. వైన్ టూరిజం ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని అందించడంతో పాటు ద్రాక్ష రైతులకు ప్రోత్సాహం, ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణ, స్థానికంగా ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ పర్యాటక విధానం 2025-30లో భాగంగా రాష్ట్రంలో వినూత్న పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ టూరిజం కాన్‌క్లేవ్‌లో రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో పలు పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పంద ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రాష్ట్రంలోనే తొలిసారిగా వైనరీ వాక్‌త్రూ అనుభూతితో కూడిన వైన్‌యార్డ్ రిసార్ట్ కూడా ఉందన్నారు. ఇందులో ద్రాక్ష సాగు, వైన్ తయారీ, బాట్లింగ్ వరకు మొత్తం పక్రియను సందర్శకులు ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో ద్రాక్షను తొక్కే 'గ్రేప్ స్టాంపింగ్' అనుభూతిని కూడా పొందవచ్చన్నారు. అంతర్జాతీయంగా విజయవంతమైన నమూనాలు, అత్యుత్తమ విధానాలను అధ్యయనం చేసి, నిబంధనలకు అనుగుణంగా ద్రాక్ష తోటలు, వైనరీలు, హాస్పిటాలిటీ, స్థానిక వంటకాలను అనుసంధానిస్తూ తెలంగాణకు అనువైన వైన్ టూరిజం నమూనాను అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఉన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608